క్లుప్తంగా

నేడు యువత పోరును విజయవంతం చేయాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెనల బకాయిలు చెల్లించకుండా, వైద్య విద్యను ప్రైవేటీకరిస్తూ విద్యార్థులను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బకాయిలు విడుదల కోసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ వద్దనున్న వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



గుంటూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని జొన్నలగడ్డలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్‌తో పాటు పరీక్షలకు అవసరమైన ఎగ్జామినేషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా మంచి మార్కులు సాధిస్తారన్నారు. ట్రస్ట్ సభ్యుడు పాశం సర్దార్ అభినంద్ యాదవ్ మాట్లాడుతూ విద్యా మనుగడ కోసం మాత్రమే కాకుండా అవగాహనను పెంపొందించే సాధనం కావాలన్నారు. ట్రస్ట్ సభ్యుడు కోనంకి మురళీకృష్ణయాదవ్, ట్రస్ట్ వలంటీర్స్ ఆనంది, కృష్ణతేజయాదవ్, ఉమేష్‌చంద్ర, సత్యా, వినాయక్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకు ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సదస్సు



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం నేతృత్వంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సమర్థంగా పూర్తి చేయడానికి, పీఎండీఎస్ కిట్స్ తయారీలో కావాల్సిన నిధుల సమీకరణలో పూర్తి సహకారం అందిస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి కోరారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధినేత టి.విజయ్ కుమార్, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు,, గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ కే రాజకుమారి, డీఏఓ గోపిచంద్ పాల్గొన్నారు.

వేజండ్ల చిన్నారి ప్రతిభ



వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన 2వ తరగతి చిన్నారి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీకుమారి మంగళవారం తెలిపారు. వేజండ్ల ఎంపీపీఎస్ బీఎఫ్ఎస్ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న కోడూరు యశ్విత ప్రియ, విభ వర్డ్ పవర్ చాంపియన్‌షిప్‌లో జిల్లా స్థాయి ప్రతిభ కనబరిచి ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. బ్లాక్ లెవల్ రౌండ్ పోటీలకు నూతక్కి వెరోనికా, యశ్విత ప్రియ, వేజండ్ల రాజశేఖర్, కోడూరు సిద్ధార్థ, సహకార్య, వేజండ్ల మధుబాబు, జశ్వంత్ ప్రతిభ కనబరిచారు. వీరిలో యశ్విత ప్రియ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. చిన్నారిని ఎంఈఓ రాయ సుబ్బారావు, హెచ్‌ఎం లక్ష్మీకుమారి అభినందించారు.

పది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేత

పాలపర్రు(కాకుమాను):విద్యార్థుల భవిష్యత్‌కు పదవ తరగతి పునాది అని అలాంటి పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు. పెదనందిపాడు మండలంలోని పాలపర్రు శ్రీ నారశింహ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పది పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులకు మంగళవారం పాఠశాల పూర్వ విద్యార్థిని తన తల్లిదండ్రులు నారాయణరావు,హరితల జ్ఞాపకార్థం పరీక్షల క్విట్‌లను అందజేశారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..!

- ప్రమాదంగా మారిన సర్వీసు రోడ్డు
- డేంజర్‌స్పాట్‌గా పెదకాకాని సెంటర్



పెదకాకాని సెంటర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయంగా మారిన ప్రదేశం

పెదకాకాని: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే పెదకాకాని సెంటర్‌లో ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల నుంచి స్పందన కరువైంది. రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. పెదకాకాని సెంటర్‌లో జాతీయ రహదారి విస్తరణ సమయంలో ఏడేళ్ల కిందట రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ఆ రోడ్డుకు స్థల సేకరణలో భాగంగా స్థలాలకు, ఆ స్థలాల్లో ఉన్న భవనాలకు నష్టపరిహారం అందజేశారు. పెదకాకాని సెంటర్‌లో గోడపాలెం వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న భవనానికి స్థలానికి నష్టపరిహారం అందజేసిన అధికారులు రెండో అంతస్తుకు పరిహారం ఇవ్వడం మరిచారు. అంతే కాకుండా పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో భవనం ఉన్నట్లు పరిహారం అందజేశారు. దీంతో పై అంతస్తుకు పరిహారం చెల్లించాలని భవన యజమానికి ఆర్డీఓ పరిధిలో ఉన్న ఆర్బిటరీని ఆశ్రయించాడు. ఏళ్లు గడుస్తున్నా సమస్య అప్పటి నుంచి ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఆ భవనం తొలగించకుండా సర్వీసురోడ్డు ఏర్పాటు చేయడంతో నిత్యం ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అదే రోడ్డులో జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ కార్యాలయం ఉండటంతో వాహనాలు ఒకదానికి ఒకటి ఎదురెదురుగా ప్రయాణిస్తున్నాయి. అదే ప్రదేశంలో మురుగునీరు పారుదల అయ్యేందుకు గొయ్యి తవ్విన అధికారులు ఇప్పటికీ దానిని అలానే ఉంచారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో భార్య మరణించగా భర్తకు కాళ్లు విరిగి పిల్లలు అనాథలుగా మారారు. మరో ప్రమాదంలో గొయ్యిలో పడి మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. అక్కడే టిఫెన్ హోటల్, పక్కనే బిర్యానీ పాయింట్, కర్రీపాయింట్, గోడపాలెం స్కూల్‌కు వెళ్లే రోడ్డు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ, గొయ్యి పూడ్చడం వంటి పనులు పూర్తి చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ట్రాఫిక్‌కు అంతరాయంగా మారిన ప్రదేశంలోనే ప్రమాదకర గొయ్యి

వంగిపురంలో తాగునీటికి కటకట

- నాలుగు రోజులుగా పనిచేయని వాటర్ ప్లాంట్
- పట్టించుకోని గ్రామ పంచాయతీ
- చోద్యం చూస్తున్న అధికారులు



సచివాలయంలో గ్రామస్తులకు సర్పంచి మద్దతుదారులకు మధ్య వాగ్వాదం

ప్రత్తిపాడు: మండల పరిధిలోని వంగిపురంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ప్లాంట్ రిపేర్ల పేరుతో నాలుగు రోజులుగా ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. పట్టించుకోవాల్సిన గ్రామ పంచాయతీ ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం, అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండటంతో ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారు. కేవలం చిన్నపాటి సమస్యను భూతద్దంలో చూపతూ నిర్లక్ష్యం వహించడంతో గుక్కెడు నీటి కోసం గ్రామస్తులు పక్కనున్న గ్రామాలకు వాటర్ క్యానులతో పరుగులు పెట్టాల్సిన దుస్థితి చోటుచేసుకుంది. ఇదిలా ఉంటే వేసవి తరుముకొస్తుండటంతో ఆయా గ్రామాల ప్లాంట్ల నిర్వాహకులు మా ఊరికి రావద్దంటూ చెబుతుండటంతో ఏమి చేయాలో పాలుపోక నానా అవస్థలూ పడుతున్నారు.

ప్రతిసారీ రిపేర్లు వస్తుంటే ఏం చేస్తున్నారు..

నాలుగు రోజులుగా నీటి కోసం నరకయాతన అనుభవిస్తున్న గ్రామస్తుల్లో మంగళవారం ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లి సమస్య ఏమిటని, ఒకటి రెండురోజులైతే పర్వాలేదు గానీ ఇలా నాలుగు రోజులుగా రిపేర్ పేరుతో నీళ్లు ఇవ్వకపోతే ఏం చేయాలని పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. వ్యవసాయ పనులు కూడా ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూలీలు కూడా వస్తున్నారని, వారికి కూడా కనీసం తాగునీరు ఇవ్వలేని స్థితిలో ఉన్నామన్నారు. సకాలంలో కుళాయిల ద్వారా కూడా తాగునీరు సరఫరా చేయడం లేదని ఆరోపించారు. స్పందించిన అధికారులు మరమ్మతుల విషయాన్ని సర్పంచి, సెక్రటరీ మా దృష్టికి తీసుకురాలేదని, ఇప్పుడే మాకు తెలిసిందని వెంటనే మరమ్మతులు చేపట్టి శుద్ధజలాన్ని అందిస్తామని ఈఓపీఆర్డీ రవికుమార్ చెప్పారు. ఈ క్రమంలో గ్రామస్తులకు సర్పంచి వర్గీయులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తాగునీటి ఇబ్బందులపై చెప్పుకునేందుకు వచ్చిన ప్రజలకు సర్పంచి మద్దతుదారులు వాగ్వాదానికి దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

నేడు విజయవాడలో వ్యవసాయ కార్మికుల ధర్నా



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని ప్రత్తిపాడు, నడింపాలెం గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను మంగళవారం స్థానిక సీఐటీయూ నాయకులతో కలసి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత 40 రోజులుగా పనులు చేస్తున్నా, నేటి వరకు వేతనాలు ఇవ్వలేదని, రోజువారీ కూలితో బతికే మేము ఎలా బతకాలని వాపోయారు. అదేవిధంగా గత నాలుగు సంవత్సరాలుగా ఉపాధిహామీ పనులు చేస్తున్నా పనిముట్లు అందజేయలేదని, గతంలో ఇచ్చే 30 శాతం సమ్మర్ అలవెన్స్, పలుగు, పారకు డబ్బులు, ప్రయాణ చార్జీలు, టెంటు పే స్లిప్పులు, మెడికల్ కిట్లు ఇవ్వటం లేదని కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పని చేస్తున్న కూలీలకు 40 రోజులుగా రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ఉపాధి హామీ పనులకు నిధులు తగ్గించారని, అలాగే పథకంలో రకరకాల మార్పులు తీసుకొచ్చి, కూలీలకు పనిమీద ఆసక్తి లేకుండా చేస్తున్నారన్నారు. ఉపాధి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 12వ తేదీన ఉదయం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా జరుగుతుందని ఈ ధర్నాలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలు తరలిరావాలని కోరారు.

మామిళ్లపల్లిలో పొలం పిలుస్తోంది



పొన్నూరు: మండలంలోని తాళ్లపాలెం, మామిళ్లపల్లి గ్రామాలలో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలను వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ కీలక దశలో ఉన్న అన్ని పంటలకు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని, నీటి తడిని దగ్గరగా ఇవ్వాలని తెలిపారు. పీఎం కిసాన్ ఆర్థిక సహాయం పొందేందుకు అవసరమైన రైతు రిజిస్ట్రేషన్ నంబర్ పొందాలని సూచించారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు లింక్ ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ డేగల వెంకట్రామయ్య, రైతు సేవ కేంద్రం సిబ్బంది సిహెచ్ భాను రేఖ, సురేష్ పాల్గొన్నారు.

శివాలయంలో దుకాణాల హక్కుల వేలం



వేలం నిర్వహిస్తున్న ఆలయ డెప్యూటీ కమిషనర్ లీలాకుమార్

పెదకాకాని: శివాలయంలో షాపులు ఏర్పాటు చేసుకునేందుకు మంగళవారం సీల్డ్‌టెండర్‌తో పాటు బహిరంగ వేలం నిర్వహించినట్లు ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దేవదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశాల 26 అంశాలకు సంబంధించి వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలను అమరావతి శ్రీ అమరేశ్వరస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కోగంటి సునీల్‌కుమార్ పర్యవేక్షణాధికారిగా విచ్చేశారు. 26 అంశాలకు గాను 15 ఐటములకు పాటలు నిర్వహించడం జరిగిందని డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. తల నీలాలు ప్రోగుచేసుకొనుట, కొబ్బరికాయలు, పూజసామాగ్రి విక్రయము, బొమ్మలషాపులు, పాదరక్షలు తదితర లైసెన్స్ హక్కులకు ఈనెల 19వ తేదీన వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. సీల్డ్‌కం బహిరంగ వేలంలో పాల్గొనే వారు ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ లైసెన్స్ హక్కుల షెడ్యూల్‌ను కార్యాలయ పనివేళల్లో పొందవచ్చన్నారు. ప్రస్తుతం జరిగిన బహిరంగ వేలం పాటల ద్వారా స్వామికి గతంలో కన్నా అధిక ఆదాయం సమకూరిందన్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ



బీకేపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి ప్రథమ స్థానంలో ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని బీకేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఎంఈఓ తనిఖీ చేశారు. ఆయన మట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించి ప్రతి విద్యార్థి ప్రథమ స్థానంలో ఉండే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్న విద్యార్థులకు పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు ఉన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: గుంటూరు తిరుమలగా ప్రసిద్ధిగాంచిన బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి కామకోటి పీఠాధిపతుల ఆశీస్సులతో ఆలయ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నాదస్వర స్వాగతాంజలి, మలిశెట్టి లక్ష్మీనారాయణ బృందం 'ఓం నమో వెంకటేశాయ' గానంతో ప్రారంభించారు. శ్రీవిశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణం వంటి పూజలను శ్రీమాన్ అగ్నిహోత్రం శోభనాచల లక్ష్మీనరసింహాచార్యుల ప్రధానార్చకత్వాన ఆలయ అర్చకులు పరుచూరి మాధవ స్వామి బృందం వేద మంత్రాలతో నిర్వహించారు. హారతి, మంత్రపుష్పం, హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీఆనందాశ్రమం(గండిపాలెం) ప్రసన్నానందగిరిస్వామి, ఆర్ష విద్యా కేంద్రం(గుంటూరు) బ్రహ్మనిష్ఠనంద సరస్వతిస్వామి అను గ్రహభాషణం చేశారు. ప్రసన్నానందగిరి స్వామి మాట్లాడుతూ భక్తి, ప్రేమ, క్షమాగుణంతో కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయవచ్చునని అన్నారు. బ్రహ్మనిష్ఠానంద సరస్వతీస్వామి మాట్లాడుతూ ఆత్మజ్ఞానం పొందాక శాంతి, సౌఖ్యం లభిస్తాయని చెప్పారు. శ్రీవేంకటేశ్వరస్వామి ధ్యానం దర్శనంతో ఆత్మజ్ఞానాన్ని సాధించాలని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారి దేవినేని కరుణచంద్రబాబు, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి కె.జి.శంకర్, పూర్వ ప్రొఫెసర్ ఆరేటి కృష్ణ కుమారి, ఈశ్వరీ విద్యాలయం బ్రహ్మకుమారి ఉమా, గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ స్వామి, వ్యాఖ్యాన సరస్వతి ఏవీకే సుజాతమాట్లాడగా, నోరి కోదండరామ్ వ్యాఖ్యతగా వ్యవహరించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యాలతో కూడిన విద్యనందించి వారికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో జేఎస్‌డబ్ల్యూ (జిందాల్) కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఏడాదికి రూ.6.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు అర్హత సాధించారు. వీరిని కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది 2024–25 విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 618 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందారని, మరికొన్ని కంపెనీల నుండి నియామక పత్రాలు రానున్నాయని తెలిపారు.

ఆక్రమణలు తొలగింపు



పొక్లెయిన్‌తో బంకులను తొలగిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: నగరంలోని శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభం కానున్న దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రజా సౌకర్యార్థం హిందూ కాలేజి జంక్షన్ నుంచి నగరంపాలెం, పట్టాభిపురం మెయిన్ రోడ్, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల జంక్షన్ వరకు రోడ్, డ్రెయిన్ ఆక్రమణల తొలగింపు చేపట్టామని, ఆక్రమణలు పునరావృతం కాకుండా నిరంతరం పట్టణ ప్రణాళిక అధికారులు పర్యవేక్షణ చేస్తారని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు మంగళవారం ఆక్రమణల తొలగింపు చేపట్టారు. త్వరలో శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, ఈ నేపథ్యంలో నగరంపాలెం రోడ్ ప్రధాన ప్రత్యామ్నాయ రహదారి కానున్నదన్నారు. సదరు రోడ్, డ్రెయిన్ల మీద ఆక్రమణల వలన ట్రాఫిక్ సమస్యలు ఎదురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఈ నెల 6వ తేదీనే పత్రికముఖంగా, నేరుగాను వారికి తెలిపామన్నారు. కొందరు తొలగించుకున్నారని, తొలగించుకోని వాటిని మంగళవారం ఒకవైపు తొలగిస్తున్నామని, బుధవారం మరో వైపు తొలగిస్తామన్నారు. ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియగా చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశామన్నారు.

వివాహిత అదృశ్యం

లక్ష్మీపురం: వివాహిత అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీ అగ్రహారం 18వ లైన్ ప్రాంతానికి చెందిన బూసిరెడ్డి మాలాద్రి పొక్లెయిన్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మాలాద్రికి పది సంవత్సరాల క్రితం హైమారాణితో వివాహం అయింది. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. అయితే 2024 డిసెంబర్ 22న మాలాద్రి ఇద్దరు పిల్లలతో కలిసి కనిగిరిలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి 24వ తేదీన గుంటూరు వచ్చారు. ఇంట్లో భార్య హైమారాణి కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వైభవంగా శ్రీసంతాన లక్ష్మీ నారాయణుల కల్యాణం



నగరపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డ రోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం గోపూజ, గణపతి పూజతో ప్రారంభించారు. తొలుత పుణ్యాహవచనం, మండపారాధన, ప్రవరలు, మహాసంకల్పంతో శ్రీ సంతానలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా జరిగింది. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం కల్యాణానికి హాజరైన దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణ చేశారు. ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ, ధర్మకర్త మర్రిపాటి పార్థసారథి పర్యవేక్షించారు.

ఎస్‌డబ్ల్యూపీసీల్లో వర్మీ ఎరువు తయారీ



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ రవికుమార్

ప్రత్తిపాడు: ఎస్‌డబ్ల్యూపీసీల్లో వర్మీ ఎరువును తయారు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ కె.శివ పార్వతి అన్నారు. మండలంలోని పదహారు గ్రామ పంచాయతీల అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీఓఏలు, ఆశ కార్యకర్తలు, క్లాప్ మిత్రలకు చెత్తను వేరు చేయు విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన ఎంపీడీఓ కె.శివపార్వతి మాట్లాడుతూ ఇంటి నుంచి వచ్చే చెత్తను ఎరువుగా తయారుచేయు విధానాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు తమ ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడి వ్యర్థాలుగా వేరుచేసి క్లాప్ మిత్రలు అందిచాలని కోరారు. వాటి ద్వారా వర్మీ కంపోస్టు ఎరువు తయారవుతుందని చెప్పారు. ఈఓపీఆర్డీ జి.రవికుమార్ మాట్లాడుతూ ప్రతి మహిళ తమ నివాసంలోని చెత్తను వేరు చేయు విధానంపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటిపన్నుల వసూలు వేగవంతం చేయాలి

డీపీఓ సాయికుమార్



ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసులను అందిస్తున్న డీపీఓ సాయికుమార్

గుంటూరు రూరల్: గ్రామాల్లో ఇంటిపన్నుల వసూలు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ ఆదేశించారు. మండలంలోని వెంగళాయపాలెంలో మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఇంటిపన్నుల వసూలు పరిశీలించి ఇళ్లయజమానులకు డిమాండ్ నోటీసులను అందించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు త్వరితగతిన ఇంటిపన్నులు వసూలు చేయించాలని కోరారు. సమయం తక్కువగా ఉన్నందున సిబ్బంది అందరూ సమష్టి కృషితో ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఈఓ వి.రవి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



వెహికల్ షెడ్‌లో సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, ఇప్పటికే ప్రజారోగ్య విభాగం పటిష్టతకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. వెహికిల్ షెడ్, సంగడిగుంట, కొత్తపేట, రైల్ పేటలోని పలు ప్రాంతాలలో మంగళవారం పర్యటించారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు పరిశీలించారు. తొలుత నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ని పరిశీలించి, పారిశుద్ధ్య పనులకు డివిజన్ల వారీగా కేటాయించిన ట్రాక్టర్లు, పుష్ కాట్స్, ఈ-ఆటోల గురించి ఇన్‌స్పెక్టర్లను సెట్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శానిటరీ డివిజన్లకు కేటాయించిన ట్రాక్టర్లు ఇన్‌స్పెక్టర్ల నిర్వహణలోనే ఉంటాయని, చెత్త తరలింపునకు వాహనాలు అందుబాటులో లేవనే సమస్య రాకుండా డివిజన్లకు వాహనాలు అందించామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు తప్పనిసరిగా పనుల్లోనే ఉండాలి తప్ప డెప్యూటేషన్, సూపర్వైజర్ పేరుతో ఉండడానికి వీలు లేదని స్పష్టం చేశారు. తమ రోజువారీ విధుల్లో కార్మికుల పనిని, హాజరుని తనిఖీ చేస్తామన్నారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు సీనియర్ అధికారులను కేటాయించామని, ప్రతి రోజు కార్మికుల మస్టర్, పారిశుద్ధ్య పనులు క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. శానిటేషన్ కార్యదర్శులు తప్పనిసరిగా నిర్దేశిత సమయంలో విధుల్లో ఉండాలన్నారు. అనంతరం సంగడి గుంట, కొత్తపేట, రైల్ పేటల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసి, మైక్రో ప్యాకెట్స్ ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. జీటీ రోడ్‌లో స్వీపింగ్ మెషిన్‌ల పనితీరు పరిశీలించి, మెయిన్ రోడ్ల డివైడర్ల పక్కన పరిశుభ్రంగా ఉండేలా ప్రతి రోజు స్వీపింగ్ జరగాలన్నారు.

తొలగించిన సెక్యూరిటీ గార్డ్స్‌ని విధుల్లోకి తీసుకోవాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ గాంధీ పార్కులో 2023 డిసెంబర్ నుంచి పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌ను విధుల నుంచి తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు డిమాండ్ చేశారు. మంగళవారం తొలగించిన సెక్యూరిటీ గార్డ్స్‌తో కలసి అరండల్‌పేటలోని లేబర్ కార్యాలయంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సుభానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ గాంధీ పార్కులో సెక్యూరిటీ గార్డ్స్ నిర్వహణకు సేవా సుప్రీం అనే ఏజెన్సీ ద్వారా వర్క్ అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై 13 మంది సెక్యూరిటీ గార్డ్స్‌ని విధుల్లోకి తీసుకున్నట్లు చెప్పారు. అయితే నగరపాలక సంస్థ వారు ఒక్కొక్క సెక్యూరిటీ గార్డుకు నెలకు రూ.14,337 వేతనంగా నిర్ణయించడం తోపాటు అందులోనే పీఎఫ్, ఈఎస్ఐ, యూనిఫాం సదుపాయాలు కల్పించాల్సిన ఆ ఏజెన్సీ వారికి షరతులతో ఆ పనిని అప్పగించడం జరిగిందన్నారు. అయితే ఏజెన్సీ వారు 13 మంది సెక్యూరిటీ గార్డ్స్‌కు అరకొరగా జీతాలు ఇస్తూ ఇప్పటి వరకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించకుండా వారి శ్రమను దోచుకున్నారని ఆరోపించారు. దీనిపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఏజెన్సీకి మేలు గలిగే విధంగా వ్యవహరించడం జరిగిందన్నారు. దీనిపై స్పందించి సెక్యూరిటీ గార్డ్స్‌కు న్యాయం చేకూర్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని లేబర్ ఆఫీసర్‌ను కోరారు.